www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 13 ఏప్రిల్ 2023



రేపు ఘనంగా అంబేద్కర్ జయంతి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈనెల 14న భారత రత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సగిలి షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.30గంటలకు స్థానిక దర్గాసర్కిల్ చిత్తూరులో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఉదయం 10.30 గంటలకు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, డివిఎంసి సభ్యులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

వైఎస్సార్ ఈబీసీ నేస్తంతో 23,668 మందికి

రూ.35.50 కోట్లు లబ్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళల జీవనోపాధి అవకాశాలు, జీవన ప్రమాణాలు పెంచి ఆర్థిక సాధికారత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజిక వర్గాల్లోని 40 నుంచి 60 సంవత్సరాల వయస్సు మధ్య గల మహిళలు ఆర్థికంగా ఎదగాలని వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద గుర్తించిన లబ్ధిదార్లకు రూ.15వేలు చొప్పున మూడు సంవత్సరాలకు రూ.45వేలు అందిస్తోందన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత లబ్ధిని కంప్యూటర్‌లో బటన్ నొక్కి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేయగా వర్చువల్ విధానంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి, నగర మేయర్ అముద, జెడ్‌పి వైస్‌చైర్‌పర్సన్ రమ్య, ఈడీ బీసీ కార్పొరేషన్ సుబ్రహ్మణ్యం, జెడ్‌పి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, తవణంపల్లి జెడ్‌పిటిసి, స్త్రీ శిశుసంక్షేమ స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్‌పర్సన్ మధుబాల, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రవర్ణాలలోని పేదలకు ఆర్థికసాయం అందజేసేందుకు వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకంను అమలు చేయడం జరుగుతున్నదన్నారు. జిల్లాలో రెండో విడత కింద 2022-23 సంవత్సరంలో 23,668మంది లబ్ధిదారులకు రూ.35.50 కోట్లు లబ్ధి చేకూరడం జరుగుతున్నదని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల, ఇత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడం జరుగుతున్నదని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందేశారు.

రోజుకో వివాదంలో 'కాణిపాకం'

- సామాజిక మాధ్యమాల్లో గర్భగుడి ఫొటోలు
- కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో ఈవో ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ఐదు, ఆరు నెలలుగా కాణిపాకం ఆలయాన్ని వరుస వివాదాలు ముంచేత్తుతున్నాయి. గతంలో ఎన్నడు లేనివిధంగా అవినీతి అక్రమాలు ఆలయ అధికారుల ఏకపక్ష నిర్ణయాలు వంటి వాటి వల్ల ప్రతిరోజు ఓ వివాదం అవినీతి అక్రమాలు కాణిపాకం దేవస్థానంలో బయటపడుతున్నాయి. దీంతో ఆలయ ప్రతిష్ట మసకబారుతుండగా భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. తాజాగా ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్వామివారి గర్భాలయ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు గత రెండు రోజుల క్రితం కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనానికి వచ్చి మంత్రాలయం నుండి దర్శనం చేసుకుంటుండగా అతని అనుచరుడు స్వామివారి గర్భాలయ ఫోటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. ఈ విషయం మంగళవారం రాత్రి నుంచి సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేస్తున్నాయి. ఆలయంలో రాజగోపురం నుంచి అర్ధమండపం వరకు సెక్యూరిటీ సిబ్బంది ఆలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న గర్భాలయం ఫోటో తీస్తుంటే అందరూ ఏం చేస్తున్నట్లు.. ఈవైఫల్యం ఎక్కడిది.. సెక్యూరిటీ సిబ్బందిదా.. ఆలయ అధికారులదా.. సిబ్బందిదా.. అర్చకులుదా అనేది అర్థం కావడం లేదు.

గత ఆరు నెలల కాలంలో దేవస్థానం ప్రధాన ఆలయం అనుబంధాలయాల్లో పనిచేసే నలుగురు అర్చకులు ఒక టెంపుల్ ఇన్స్పెక్టర్ 6మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వేర్వేరు కారణాలతో సస్పెన్షన్‌కు గురయ్యారు. అలాగే పలువురిపై పోలీస్ కేసులు సైతం నమోదయ్యాయి. ఈవిధంగా ప్రశాంతతకు ఆధ్యాత్మికతకు నిలయంగా ఉన్న కాణిపాకం ఆలయం వరుస వివాదాలకు వేదికగా మారింది. దీంతో భక్తులు మనోభావాలు దెబ్బతింటున్నాయి. రోజుకో వివాదం దేవస్థానంలో రేగుతుండడంతో ఆలయ అర్చకులు సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వరుస వివాదాలు దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు సైతం తలనొప్పిగా తయారైంది. ఈవరుస వివాదాలు ఎంతవరకు దారితీస్తాయోనని స్థానికులు ఉభయదారుల సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్న కాణిపాకం ఆలయం గర్భగుడి ఫోటో

కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు..

సోషియల్ మీడియాలో చక్కర్లు కొట్టిన కాణిపాకం గర్భగుడి ఫోటోలు ఓ ఆకతాయి తీసిన ఫోటోలంటూ కాణిపాకం ఆలయ ఈవో బుధవారం కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం పత్రికల ద్వారాను, టీవీఛానల్స్ ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ అయిన స్వామివారి మూలమూర్తి ఫోటోలను వీఐపీ భక్తులు ద్వారా వచ్చిన ఒక ఆకతాయి ఫోటోతీసి సామాజిక మాధ్యమాల ద్వారా ఫేస్‌బుక్‌లో ఉంచడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా గట్టి నిఘా ఏర్పాటుచేసి తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో పాలకమండలి సభ్యులు, భక్తులు, విఐపిలు, వీఐపీలు ద్వారా వచ్చేటువంటి సిబ్బంది, ఉభయ దారులు, మీడియా మిత్రులు ఇకపైన ఆలయంలోకి సెల్‌ఫోన్లు మరే ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకుండా చర్యలు తీసుకోనున్నట్లు కాణిపాకం ఈఓ వెంకటేశలు తెలిపారు.

సిబ్బందికి, హోంగార్డులకు సూచనలు జారీ చేసిన ఈవో


ఐరాల: స్వామివారి ఆలయంలోకి సెల్‌ఫోన్లు, కెమెరాలు అనుమతించకూడదని చైర్మన్, ఈవో ఆదేశాల మేరకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, విఐపి క్యూలైన్ రూ.100లు, క్యూలైన్ రూ.150లకు, ఆలయ వెలుపలదారి, ఉచిత దర్శనం, క్యూలైన్ దగ్గర పనిచేయు హోంగార్డ్ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎవరైనా సరే ఆలయంలోకి ఫోన్లతో అనుమతించకూడదని సిబ్బందిని కూడా వెలుపల ఉంచి ఆలయంలోకి ప్రవేశించాలని సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, హెూంగార్డు ఇన్చార్జ్ పిఎల్‌సి వినాయకం, తదితరులు ఉన్నారు.

డీఎస్సీ 98 ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేయాలి

రిజర్వేషన్లు అమలు చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో 98 డీఎస్సీ పోస్టులను కుదించడమే కాకుండా రిజర్వేషన్‌లు అమలు జరపకపోవడాన్ని సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచపాండవులు మంచం కోళ్ళ సామెతలా 98 డిఎస్సీలో 7000 పైచిలుకు ఖాళీలు ఉండగా 4534 ఖాళీలు మాత్రమే ఉన్నట్లు ప్రకటించి 4072 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పోస్టులు లేవని ప్రకటించిన జిల్లాలకు కూడా ఇతర జిల్లాల లాగే సర్దుబాటు చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని, ప్రకటించిన పోస్టులను రిజర్వేషన్ల కోటా ప్రకారం పూర్తిగా భర్తీ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని తాము అధికారంలోకి వస్తే వాటిని భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ ఇప్పటి వరకు ఒక్క పోస్టునూ భర్తీ చేయలేదని విమర్శించారు. గత 4 సంవత్సరాలలో ఒక్క డిఎస్సీ కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించలేదుని వేలాది పోస్టులు ఖాళీలు ఉన్నా వాటిని నింపకుండా స్కూళ్ళను విలీనం చేసి, తరగతులను కుదించి, ఖాళీలను తగ్గించారన్నారు. పైగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు పొంతన లేని లెక్కలు చెబుతూ, నిబంధనల సాకులు చూపుతూ నిరుద్యోగుల్కెన యువతను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇప్పటికైనా మెగా డిఎస్సీ నిర్వహించి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ ఖాళీలను పూర్తిచేస్తేనే అందరికీ నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటులోకి వస్తుంది తప్ప బ్యైజూస్ లాంటి కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని టీచర్ల సంఖ్యను కుదిస్తే ఉన్న చదువులు అంటకాగుతాయన్నారు. డిఎస్సీ 98 అర్హులైన అభ్యర్థులందరికీ ఉద్యోగాలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందని, కటాఫ్ పద్ధతిలో ఎంపిక వల్ల, రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల వందల సంఖ్యలో అభ్యర్థులు ఉద్యోగాలకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ఇది ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తుందని కొన్ని జిల్లాలకు మాత్రమే ఎస్జీటి పోస్టుల సర్దుబాటు చేస్తున్నారని ఆ పద్ధతిలోనే అన్ని జిల్లాలకు సర్దుబాటు చేసి పోస్టులు కల్పించాలన్నారు. జరిగిన లోపాలను సరిదిద్ది 98 డిఎస్సీ, 2023 మెగా డిఎస్సీకి వేరువేరుగా నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సిబ్బంది



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నూతన కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను రెడ్‌క్రాస్ కార్యవర్గం బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సేవలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ రమేష్‌బాబు, వైస్‌ఛైర్మెన్ గోవర్ధన్‌బాబీ, కార్యవర్గ సభ్యులు రెడ్డెప్ప, రఘుపతి రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలు జాగ్రత్త...!

బావులు, చెరువుల వద్దకు పంపకండి: పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్

ప్రజాశక్తి -సోమల: పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలు గ్రామ సమీపాలలోని బావులు చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ తెలిపారు. బుధవారం సోమల పంచాయతీ చిన్న సోమల సమీపంలోని మల్లప్ప ఒడ్డు వద్ద పలువురు విద్యార్థులు చెరువులో ఈత కొడుతుండగా సోమల పోలీసులు వీఆర్వో సచివాలయ సిబ్బంది అక్కడికి వెళ్లి విద్యార్థులకు పలు సూచనలు జాగ్రత్తలు చెప్పి కౌన్సిలింగ్ ఇచ్చారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు బావులు చెరువుల వద్దకు ఈతకు వెళ్లి ఈత రాక ప్రమాదాలు కొని తెచ్చుకునే అవకాశం ఉందని ఇందుకోసం తల్లిదండ్రులు తమ పిల్లలను వారి సంరక్షణలోనే ఈత నేర్పించడం, ఈత కొట్టించడం చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు అన్ని జాగ్రత్తలు చెప్పివేసవి సెలవులను ఎలాంటి అవాంతరాలు లేకుండా జరుపుకోవాలని సూచించారు.

విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సుధాకర్ కుమార్



రీసర్వేను వెంటనే పూర్తి చేయాలి: కలెక్టర్



భూ రీసర్వేపై అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతా కార్యక్రమాల్లో రీసర్వే కార్యక్రమం ఒకటని, ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో రీసర్వేకి సంబంధించి ఆర్‌డిఓలు, సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమం పూర్తి అయిన 134 గ్రామాలకు సంబంధించి సర్వేరాళ్లు నాటే కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా డ్రోన్ సర్వేపూర్తి అయి ఓఆర్‌ఐ షీట్లు వచ్చిన గ్రామాలకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ కార్యమ్రకాన్ని నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 823 గ్రామాలకు గాను 766 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి అయ్యిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రీసర్వే కార్యక్రమంలో సమస్యలను వెంటనే గుర్తించి సకాలంలో పరిష్కరించాలని భూయజమానులకు ఎటువంటి సమస్యలు లేకుండా భూహక్కు పత్రాలను అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు సంబంధించి సర్వేరాళ్లు వచ్చిన వాటిని వెంటనే నాటించే కార్యక్రమం చేపట్టి పూర్తి చేయాలన్నారు. రీసర్వే కార్యక్రమంలో ఎక్కువగా కుప్పం, పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాలలో రీసర్వే పూర్తి అయిందని రాళ్లు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని రోజుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 42 రోవర్ల ద్వారా 1500 సర్వేరాళ్లు నాటడం జరుగుతున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓలు రేణుకా, సుజన, శివయ్య, ట్రైనీడిప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలతోపాటు ఏడి సర్వేల్యాండ్ రికార్డ్స్ కనకప్రసాద్, డిఐలు, ఇతర సర్వేఅధికారులు పాల్గొన్నారు.

గ్రామాలపై గజదాడులు

పంటనష్టంతో ఆందోళనలో రైతన్నలు



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 7గంటలకు 22 ఏనుగుల గుంపు పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తూ రైతులను ప్రజలను భయభ్రాంతులను చేశాయి. ఏనుగుల గుంపు చెత్తపెంట గ్రామంలోకి ప్రవేశించినట్లు గమనించిన అటవీశాఖ అధికారులు ట్రాకర్స్ కలసి వాటిని తరిమెందుకు ప్రయత్నం చేశారు. చెత్తపెంట నుంచి నలగాంపల్లి గ్రామంలోని చిట్టినాయుడు అనే రైతుకు చెందిన ఎకరా రాగిపంటను, వరి పంటను మామిడి తోటలను తొక్కి నాశనం చేశాయి. ఆ తరువాత కోటూరు మీదుగా మండీపేట గ్రామసమీపంలో గుంపు ఏనుగులను అష్టకష్టాలు పడి పంటలపై వెళ్ళనీయకుండా వూసరపెంట మీదుగా తరలిస్తుండగా అర్ధరాత్రిలో ట్రాకర్స్‌లపై హటాత్తుగా తిరగబడ్డాయి. కొంత సేపటికి అక్కడ నుండి కాలవపల్లి దొమ్మరపాపమ్మ గుడికి మధ్యన పంటపొలాల మీదుగా వాటిని ఉదయం 6 గంటలకు గుడియాత్తం రోడ్డు దాటి అడవిలోనికి మళ్ళించారు. గుంపుఏనుగులు రాత్రికి ఎటువైపు వస్తాయోనని రైతులు కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారు. ఈ గుంపు ఏనుగుల వలన గ్రామాల్లో వరి, రాగి, మామిడి పంటలకు తీవ్రనష్టం ఏర్పడింది.



ఆస్తిపన్ను పెండింగ్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం

సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్




ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆస్తి పన్నుకు సంబంధించి కోర్టులో పెండింగ్ ఉన్న కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కారం చేయబడుతుందని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఛాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ సూచనలు మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్రటరీల పరిధిలో ఆస్తిపన్నుకు సంబంధించిన కేసులు కోర్టులలో పెండింగ్‌లో ఉన్న లేదా ముందస్తుగా (ప్రీ లిటిగేషన్) కేసులను నమోదు చేసుకొని మేనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కేసులు పరిష్కారం చేయబడుతుందని తెలిపారు. అంతేకాకుండా నివాస ప్రాంతాలలో కొత్తగా గృహాలు నిర్మించుకొనేవారికి అప్రూవల్‌కు సంబంధించి కేసులు ఉన్నను వాటిని కూడా జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకొనే అవకాశం ఉందన్నారు. నీటి కాలుష్యానికి సంబంధించి మున్సిపల్, కాలుష్య నియంత్రణ బోర్డు వారి పరిధిలో ఉన్నటువంటి కేసులను కూడా జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కారం చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వాతావరణం కాలుష్యం జరుగుతున్న మీ శాఖల పరిధిలో ఉన్నటువంటి కేసులు కోర్టులలో పెండింగ్‌లో ఉన్నాను, ప్రిలిటిగేషన్ కేసులకు నోటీసులు ఇచ్చి వాటిని కూడా జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం చేయబడతాయని అన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఉన్న న్యాయసేవ అధికార సంస్థ ద్వారా కేసులను, ప్రిలిటిగేషన్ వేసి పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు అందరికీ సూచించడం మీ పరిధిలో ఉన్న ఆస్తి పన్నులకు, నీటి కాలుష్యానికి సంబంధించి ఏమైనా సమస్యలుంటే వాటిని గుర్తించి జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించేందుకు సంబంధిత శాఖాధికారులు సహకరించాలన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఛైర్మన్ వారి నుంచి మున్సిపల్, పంచాయతీలకు సంబంధించిన రాష్ట్రస్థాయి కమిషనర్లుకు వీటికి సంబంధించి ఆదేశాలు జారీ చేయడమైనదని తెలిపారు.

'కలుపుకు పోవడం లేదు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీడినెల్లూరు నియోజకవర్గంలో వర్గవిభేదాలున్నాయి. డిప్యూటీ సిఎం నారాయణస్వామి నాయకులు, ప్రజాప్రతినిధులను కలుపుకుపోవడం లేదని, ఫలితంగా వర్గవిభేదాలతో పార్టీ ఇబ్బంది పడ్డాల్సి వస్తోందని మాజీ ఎంపి ప్రస్తుత ఎన్‌ఆర్‌ఐ సమన్వయకర్త జ్ఞానేంద్రరెడ్డి డిప్యూటీ సిఎంపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వైఎస్ఆర్ ఈబిసి నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జ్ఞానేంద్రరెడ్డి వీడియోతో మాట్లాడారు. జీడి నెల్లూరులో పోటీ చేసేందుకు తానేమి ఎస్సీని కాదని, వచ్చే ఎన్నికల్లో నారాయణస్వామికి సీటు వచ్చేది లేనిది ఇప్పుడే చెప్పలేమని అన్నారు. గత ఎన్నికల్లో నారాయణస్వామిని గెలిపించడానికి నా వంతు ప్రయత్నం చేసి ఎమ్మెల్యేగా గెలిపించానని, తమ పార్టీలో పెనుమూరు మండలంలోనే కాదు ఆరు మండలాలలో వర్గవిభేదాలు ఉన్నాయన్నారు. ఏది ఏమైనా పార్టీ జగన్ కోసం తాను పని చేయనున్నట్లు చెప్పారు.



ఎన్‌ఆర్‌ఐ జాతీయ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి

పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పిల్లలలోఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశపు మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ,స్త్రీశిశుసంక్షేమ, సర్వశిక్ష అభియాన్, విద్యాశాఖ, ఇంటర్ మీడియట్, సిపిఓ, డిసిహెచ్ఎస్ అధికారులతో పిల్లల, గర్భవతులు, బాలింతలు, 10 నుంచి 19 సంవత్సరాల బాలికలలో రక్తహీనతను తగ్గించడానికి తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ విద్యాశాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు కలసి పనిచేయడం ద్వారా నివేదికల్లో తేడా లేకుండా ఉండేందుకు అవకాశం కలదన్నారు. సచివాలయ పరిధిలోని చిన్నపిల్లలు, 10 నుండి 19 సంవత్సరాల లోపు బాలికలను గర్భ వతుల అందరికీ పరీక్షలు చేయాలని, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు జగనన్న గోరుముద్ద, డివార్మీ ఐఎఫ్ టాబ్లెట్స్ అందించిన విదంగా డేటాఉండాలన్నారు. ఈసమావేశంలో సిపిఓ ఉమాదేవి, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ప్రకాశం, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, ఎస్ఎస్ఏ పిఓ వెంకటరమణారెడ్డి రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ పిడి నాగశైలజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు



ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు కొరకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగన్నన విద్యా కానుక కిట్ల పంపిణీకి పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు జిల్లా పరిశీకులు స్టేట్ ఏక్సిక్యూటివ్ ఇంజినీర్ ఆఫీసర్లు కె.రవీంద్రబాబు, సిఎంఓ గుణశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో 2023-24 సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక కిట్లు భద్రపరిచే గోడౌన్లను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ పి.లీలారాణి, ఎంపిఎం మెగిలీశ్వర్, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, పాటించాల్సి జాగ్రత్తలను వివరించారు. వర్షానికి కిట్లు తడవకుండా, ఎలుకల భారినపడి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి హెచ్ఎం విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్నపన తిరుమంజనం



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వసంతోత్సవంలో భాగంగా రెండవ రోజైన బుధవారం, ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన కొలువు తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. వంసతోత్సవం సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివార్లను వసంత మండపం వద్దకు వేంచేసి మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు వేదపండితులు ఉభయ దేవేరులతోపాటు శ్రీవేణుగోపాల స్వామివారిని పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనె, నారికేళి వంటి సుగంధ జలాలతో అత్యంత వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల మధ్య వేదపండితులు వేదమంత్రాలతో స్వామివార్లకు ఆస్థానం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పాలు విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకొన్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్ కుమార్, అర్చకులు గోపాలాచారి ఆలయ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

పశువుల రవాణా నిషేధించాలి

ప్రజాశక్తి- గంగవరం

పశువులలో ముద్ద చర్మవ్యాధి సోకకుండా అన్ని పశువుల సంతలను నిలిపివేయడంతో పాటు, అంతరాష్ట్ర రవాణాను కూడా పూర్తిగా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ ఆపి వేయాలన్న కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలో సంబంధిత కార్యనిర్వాహక వర్గాలు కఠినంగా వ్యవహరించాలని మండల పశువైద్యాధికారి సుధానిధి అన్నారు. గురువారం మండల పరిధిలోని జంగాలపల్లి చెక్‌పోస్ట్‌ను పశువైద్యాధికారి తనిఖీ చేశారు. ఈసందర్భంగా చెక్‌పోస్టు సిబ్బందికి కలెక్టర్ ఉత్తర్వులను అందజేసి ముద్దచర్మ వ్యాధి ప్రబలి, దేశ వ్యాప్తంగా పాడిరైతులకు తీవ్రనష్టాలకు గురిచేస్తున్న విషయాన్ని వివరించి, చెక్‌పోస్టులు, పశువుల సంతలో పూర్తిగా నిర్బందించ గలిగితే ఈవ్యాధి మన జిల్లాలో ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా ఆపి పాడిపరిశ్రమను కాపాడాలని సూచించారు. చెక్‌పోస్టు ద్వారా కాకుండా కర్నాటక సరిహద్దు గ్రామాలైన గుండుగల్లు, పశు పత్తూరు గ్రామాల గుండా పశువుల రవాణా నిర్బందించడం కోసం ఆ గ్రామాల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చేపట్టాలని కోరారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా అటువంటి పశువుల వాహనాలను అటకాయించి తిప్పిపంపాలని సూచించారు. ముఖ్యంగా కర్ణాటకలోని చింతామణి పశువుల సంత నుంచి తెస్తున్న పశువుల నుండీ ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలే అవకాశాలు ఎక్కువగా వున్నాయని, కొద్ది నెలలపాటు అటువంటి పశువుల సంతలకు వెళ్లకూడదని సూచించారు. మండల పరిధిలోని సరిహద్దు గ్రామాలలో ముందస్తుగా వ్యాధినిరోధక టీకాలను వేస్తున్నామని, ఇప్పటికే రెండువేల పశువుకు ఈ టీకాలు వేసామన్నారు. పాల డైరీలు ఎక్కువగా వున్న పలమనేరు, గంగవరం గ్రామాలలో ఈవ్యాధి విస్తరించకుండా పశువుల మందులను పిచికారి చేసి, పాడి రైతులను ఆదుకునేందుకు తమవంతుగా ముందుకు రావాలని సూచించారు. వ్యాధిసోకిన ఇంగ్లీషు మందులతో పాటు ఆయుర్వేదిక లేపనాలు వాడొచ్చని, మండల పశు వైద్యసిబ్బంది పాడి రైతులను ఈ పరిస్థితి మెరుగుపడే వరకూ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మే 14 నుంచి 30వ తేదీన జరిగే 'మోడీ దింపాలి భారతదేశాన్ని కాపాడుకోవాలని' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటియుసి అనుబంధ సంఘాల విస్తతస్థాయి సమావేశం స్థానిక ఎస్టీయు కార్యాలయంలో జిల్లా నాయకులు దాసచంద్ర అధ్యక్షతన జరిగింది. నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికవర్గం జీతాల కోసం హక్కుల కోసం అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ జీతాల పెంచడంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు పేరుతో మహిళలకు అందిస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి- కార్వేటినగరం: వేసవికాలంలో పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పుత్తూరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ గోవిందయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పాడిరైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపసంచాలకులు మాట్లాడుతూ వేసవి దష్య పాడి ఆవులను ఉదయం 11 నుంచి 4 గంటల వరకు బయట వదల కూడదని సూచించారు. ఎండ వల్ల పాడి ఆవులకు వడదెబ్బతో పాటు పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. అనంతరం నగరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకు డాక్టర్ వాసు మాట్లాడుతూ ఎండకాలంలో తొలకరి వర్షాలకు ఆవులు ఎదకు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, పాడి రైతులు గుర్తించి సకాలంలో కత్రిమ గర్భదరణ చేయించుకోవాలన్నారు. పాడి పశువులకు తరచు వ్యాపించే పదుగు వాపువ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, పశువైద్యాధాధికారులు సలహాలు, సూచనలు పాటించాలని, పొదుగు వాపుపై రైతులకు ఉన్న అపోహాలను వీడి వైద్యం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణ, డాక్టర్ చైతన్య, డాక్టర్ హేమకుమార్, వీఎలో శశిధర్రెడ్డి, వీఏ రమేష్, ఏహెచ్ఎలు, రైతులు పలువురు పాల్గొన్నారు.

టీకాలతో ప్రాణాంతకవ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: చిన్నారులకు టీకాలు వేయడం వల్ల 13 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని డాక్టర్ దివ్య, ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంపరిధిలోని ఎస్-ఎస్.కొండలో వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లులు తప్పక చంటిబిడ్డలకు టీకాలు వేయిస్తే వ్యాధి నిరోధకత పెరిగి ఎలాంటి వైరస్‌లకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఆరునెలల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు ఇంటిలో చేసే ప్రతి ఆహారాన్ని పెట్టాలని, అంగన్వాడీలో ఇచ్చే బాలామతం తినిపిస్తే బిడ్డలు శారీరక, మానసికవద్ధితో పాటు చురుకుదనంగా ఎదుగుతారని సూచించారు. వేసవికాలంలో వచ్చే వైరల్ వ్యాధులు, చికెన్ పాక్స్, వడదెబ్బ జాగ్రత్తలు పై వివరించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్వైజర్ వరలక్ష్మి, హెల్త్ సెక్రటరీ క్రాంతి, ఆశావర్కర్లు విజయలక్ష్మి, భారతి, ప్రమీలమ్మ పాల్గొన్నారు.



ఘనంగా వెంకటేగౌడ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి- వీకోట: ఎమ్మెల్యే వెంకటేగౌడ జన్మదిన సందర్భంగా మండలంలోని వైఎస్సార్ కూడలి వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌చేసి అక్కడ నుండి లాంగ్ బజార్ మీదుగా జరిగిన ర్యాలీలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్‌కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వినూత్న రీతిలోని భారీ గజమాలతో ఎమ్మెల్యేని సత్కరించారు. రాష్ట్ర వైసిపి ప్రధాన కార్యదర్శి పిఎన్.నాగరాజు, మండల వైస్ఎంపీపీ తమీంఖాన్, లక్ష్మణ్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలగురునాథ్, జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గౌస్‌పాల్గొన్నారు.

పలమనేరు మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కార్యకర్త రాజేష్ ఆధ్వర్యంలో 19వ వార్డు మైనార్టీలకు రంజాన్ తోపా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే స్థానిక సిఎస్ఐ చర్చిలో స్థానికులతో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పలమనేరు రూరల్, మున్సిపాలిటీకి సంబంధించిన పార్టీ నాయకులు అభిమానులు, కార్యకర్తల నడుమ స్థానిక టవర్ క్లాక్ వద్ద కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు మండి సుధా, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకష్ణ, జెడ్పిటిసి మల్లికా రంగనాథం, ఎంపీపీ రోజా, రూరల్ మండలాధ్యక్షులు బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి మండలంలో డిసిసిబి చైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి, జెడ్‌పిటిసి కేశవులు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానంద గౌడ్, సచివాలయం కన్వీనర్ కార్తికేయన్, సర్పంచులు, ఎంపిటిసిల నడుమ ఎమ్మెల్యే వెంకటేగౌడ కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగవరం మండల పార్టీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

పెద్దపంజాణి మండలం ఎంఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సుష్మాభాగారెడ్డి, వైస్ ఎంపిపి జీడి బాబు, అంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ బాబురెడ్డి, మండలపార్టీ కన్వీనర్ భాగారెడ్డి, తహశీల్దార్ హనుమంతరావు, విస్తరణ అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని చౌక దుకాణాలను తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి, డిటి ప్రకాష్ బాబులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత రెండు నెలలుగా ఈప్రాంతంలో చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం చౌక దుకాణ డీలర్లకు పలు సూచనలను అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని చౌక దుకాణాలలో నిత్యావసర సరుకులు ప్రతిఒక్క కార్డుదారునికి కచ్చితంగా ప్రతినెలా అందాలని ఏ కార్డుదారుడైన తనకు బియ్యం, చక్కెర కందిపప్పు ఇతర సరుకులను ఇవ్వలేదని ఫిర్యాదు చేసిన వెంటనే సంబంధిత చౌకదుకాణ నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చౌకదుకాణాలలో సరుకులను సరైన కొలతల ద్వారా కార్డుదారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో, చౌక దుకాణ డీలరు తదితరులు పాల్గొన్నారు.



చౌక దుకాణాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

పాఠశాల భూసమస్య తీర్చాలంటూ వినతి

సచివాలయ కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేసిన పాఠశాల కమిటీ సభ్యులు



ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భూసమస్యను ఇతర మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చాలంటూ ఆ పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు, సభ్యులు బుధవారం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల లోపల పైకప్పు పెచ్చులూడుతోందని ప్రమాదకరస్థితిలో ఉన్న ఈ పాఠశాలకు విద్యార్థులను పంపించాలంటే భయంగా ఉందని వారు వాపోయారు. ప్రభుత్వం రెండో విడత నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలను పునర్‌నిర్మించడానికి ఎంపిక చేయగా ఆ పాఠశాల స్థలం కోర్టు కేసులతో వివాదాస్పదంగా మారింది. ఆ స్థలయజమాని ఉదారంగా అందించిన పాఠశాల స్థలంలో తనకు సంబంధించిన భూసమస్యను కోర్టులో పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో కేసు వేశారని దీంతో ఇంతవరకు నిర్మాణ పనులు అటకెక్కాయని తెలిపారు. విద్యార్థులకు బహిర్భూమికి వెళ్ళడానికి మరుగుదొడ్లను నిర్మించలేకపోవడంతో వారు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహశీల్దారు కోర్టు సమస్య కొలిక్కి వచ్చిన తర్వాత పాఠశాల నిర్మాణానికి కావలసిన అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలి: ఎంఈఓ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: క్రమశిక్షణతో విద్యను నేర్చుకోవాలని ఎంఈఓ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని ముంగరమడుగు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని క్రమశిక్షణతో విద్యను నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. సర్పంచ్ కుమారి, కమిటీ చైర్మన్ నరేష్. రమాదేవి, ప్రధానోపాధ్యాయులు రఘుపతి నాయుడు, ఉపాధ్యాయులు అనితా దేవి పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలలో సరస్వతీ పూజ

సోమల:మండల కేంద్రమైన రామసముద్రం దిగువపేటలోని మోడ్రన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉష గణపతి పూజ, సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆపై వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు పలు సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల సిబ్బంది నాగలక్ష్మి, రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్నెమ్మగారిపల్లి గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయ బందం వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. సరస్వతీ పూజ గణపతి పూజ నిర్వహించి విద్యార్థులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసి చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.



నేరాలు - ఘోరాలు

హత్యకేసులో నిందితుడు అరెస్టు

వివాహేతర సంబంధమే కారణమని తేల్చిన పోలీసులు



శ్రీరాములు అరెస్టును చూపుతున్న సిఐ గంగిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి గాంధీ యానాది కాలనీలో మంగళవారం చోటు చేసుకున్న మహిళా హత్య వివాహేతర సంబంధం కారణంగా చోటు చేసుకున్నదని చిత్తూరు తాలూకా పోలీసులు హత్య చేసిన శ్రీరాములు అరెస్టుతో తేచ్చారు. చిత్తూరు రూరల్ మండలం, మాపాక్షి పోస్టు, గాంధీ యానాది కాలనీకి చెందిన కస్తూరి (49) ఒక సంవత్సరం క్రితం భర్త శేషయ్య చనిపోగా, మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నది. అదే గ్రామానికి చెందిన శ్రీరాములు అనే వ్యక్తీ మేకలు మేపుతూ, గత సంవత్సర కాలంగా ఆమెతో సహజీవనం చేస్తుండేవాడు. ఈనేపథ్యంలో ఆమె ఇతరులతో మాట్లాడినప్పుడల్లా ఆమెను అనుమానిస్తూ గొడవలు పడుతుండేవారు. అయితే ఆమె తన తీరు మార్చుకోకపోగా తన మాటలు పట్టించుకోలేదని, ఆమెపై పగ పెంచుకొని, ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలని నిర్ణయించుకున్నారడు. సోమవారం సాయంత్రం 4గంటలకు శేషాచలపురం గ్రామాసమీపంలో గల పద్మనాభ రెడ్డి మామిడి తోటలో మేకలు మేపుతుండగా, శ్రీరాములు కస్తూరితో గొడవ పడి, ఆమెను ఒక కొంకి కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి చంపి పారిపోయాడు. మంగళవారం 11వ తేదీ చిత్తూరు తాలూకా పొలిసు స్టేషన్‌లో కేసు నమోదు చేసిన తరువాత దర్యాప్తులో భాగంగా చిత్తూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగిరెడ్డి ముద్దాయిని బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అరెస్టు చేశారు.

ఎర్రచందనం పట్టివేత

ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా టాటా ఏసీ వాహనంలో 10 ఎర్రచందనం దొంగలున్నట్లు గుర్తించి వాహనంతో పాటు ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా సదరు ముద్దాయి తమిళనాడు వేలూరు జిల్లాకు చెందిన రామకష్ణ (25) గుర్తించి వాహనం దొంగలతోపాటు ముద్దాయిని అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్ఆర్ఓ నయంఆలీ తెలియజేశారు. ఈ దుంగల విలువ రూ.1,25,000లు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కడతట్లపల్లి గ్రామంలో నివాసముంటున్న ఆటోడ్రైవర్ వెంకటాచలపతి కొంతకాలంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా గుండెపోటు అధికం కావడంతో మార్గమధ్యంలోనే మరణించారు. మృతునికి భార్య శ్రావణి (29), కుమారులు శాంతికుమార్, వేదాంత్ ఉన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రవిచంద్రబాబు సచివాలయ సిబ్బంది దావత్రు వైఎస్సార్ బీమా నగదును రూ.10వేలు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శివశంకర్, వైఎస్సార్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి మృతిని కుటుంబానికి సానుభూతి తెలిపారు.

పుంగనూరు అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చా

రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలో అపరిస్కతంగా ఉన్న సమస్యలు పరిష్కరించి అభివద్ధి చేయడానికి తాను రాజకీయాల్లోకి రావడం జరిగిందని ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ తెలిపారు. పుంగనూరు మండలం కంగానెల్లూరు, మంగళంలో గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుసుకొని సమస్యలు తెలుసుకున్నారు. మారెమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అక్కడికి చేరిన ప్రజలతో మాట్లాడుతూ గ్రామంలో సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాల కొరకు తనవంతుగా రూ.లక్ష విరాళం అందజేశారు. తాను పుంగనూరులోనే ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎవరు ఏ సమస్య ఉన్న తనను నేరుగా కలుసుకొని మాట్లాడవచ్చు అని చెప్పారు. కేవలం పుంగనూరు అభివద్ధి ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చానని, జరిగే ఎన్నికల్లో ప్రజలు తనకు అండగా నిలబడితే అభివద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. ప్రజలు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, ఏదైనా ఇబ్బంది, తన అవసరం ఉంటే నేరుగా తనను సమస్య పరిష్కారానికి మీ కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనంద్, ఆర్‌సివై టీం ప్రతినిధులు నగేష్, కిరణ్, ధనుంజయ,శివ, హరి, రమేష్, నరసింహులు, శ్రీనివాసులు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మొక్కల పెంపకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - సోమల: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని ఐదు ఎకరాల లోపు విస్తీర్ణం కలిగిన భూమి ఉన్న రైతులు తమ భూమిలో మామిడి, జామ మొక్కలు పెంచుకునేందుకు ఉపాధి హామీ ద్వారా అవకాశం కల్పిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు ఆపంచాయతీ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీవో దినకర్ తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు, వన్ బి, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను కలిసి మరిన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

హెచ్‌పి ఏఆర్‌బి వ్యాల్యూ షాపీ ప్రారంభం

ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా హెచ్‌పీ గ్యాస్ సంస్థకు చెందిన వాల్యూ షాపి వాణిజ్య దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. మండల హెచ్‌పీ గ్యాస్ డీలర్ సి.మంజునాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ వ్యాల్యూ షాపీ దుకాణంలో గ్లాస్ టాప్ స్టౌలు, స్టెయిన్లెస్ స్టీల్ స్టౌలు, ఆప్రాన్స్, రైటర్స్, సురక్ష హెూస్ పైప్స్, ఫైర్ గాడ్స్, ఐదు కేజీల స్టవ్లు, ఐదు కేజీల అప్పు సిలిండర్, సిలిండర్లు, కొత్త కనెక్షన్లు, సర్వీసు లభిస్తాయని తెలిపారు.

టిడిపి మహిళా సమావేశం

ప్రజాశక్తి- గుడిపల్లి:మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ అధ్యక్షురాలు అనసూయ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ సమావేశంలో మాట్లాడారు. టిడిపి బలోపేతానికి గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బాబు, మాజీ ఎంపీపీ మునిరాజు, మాజీ జెడ్పిటిసి బేటప్ప, క్లస్టర్ ఇంచార్జ్ హేమంబర గౌడ్, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, రమేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏ విటమిన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఏ విటమిన్ మాత్రలు పంపిణీ కార్యక్రమం గ్రేడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మొగిలి వెంకటగిరి పాలేరు అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టారు. సంస్థ నిర్వాహకులు శేషాద్రి మాట్లాడుతూ వస్తాయని వాటి నివారించేందుకు ఏ విటమిన్ మాత్రమే ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గ్రేడ్స్‌సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పక్షాన ప్రజలు : వైస్ ఎంపిపి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వైఎస్ఆర్సిపి పక్షాన ప్రజలు ఉన్నారని వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలో సర్పంచ్ దీప్తిరెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబంలోనూ లబ్ధి పొందుతున్నారని సంక్షేమ ఫలాలతో ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నారని అన్నారు. ప్రతి పేదవాడు అభివద్ధి చెందాలన్న ధ్యేయంతో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఉపసర్పంచ్ కుమారస్వామి, గోవిందస్వామి, కిరణ్, గంగాధరం, ప్రకాష్, పవన్, గిరి పాల్గొన్నారు.

గర్భిణులు, వృద్ధులకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని వెంగంవారిపల్లి గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు బిపి, షుగర్‌కు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. అలాగే ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సుజాత, ఎర్రంరెడ్డి, భూషణమ్మ పాల్గొన్నారు.



IN THE COURT OF THE DISTRICT JUDGE OF CHITTOOR

Guardian O.P.No. 70 of 2023

1.Smt K.Jaya Sree W/o Late K.Kumar Raja,
2.Minor K.Poojitha, D/o Late K.Kumar Raja
3. Minor K.Udith Tej, S/o Late K.Kumar Raja,
Minors were rep.by their mother and guardian K.Jaya Sree
All are residing at D.No.10-179,Gandhi Road, Chittoor,Chittoor District ...Petitioners

-versus

NIL ....Respondents

Sir

GENERAL NOTICE

The petitioners have filed th e above OP requesting this Hon'ble court to appoint the 1st Petiioner as guardian for the minor petitioners 2 and 3 and also to grant permission to the 1st petitioner to sell the share of the petitioners 2 and 3 in the petition schedule mentioned properties. The said OP is posted to **25.04.2023** for calling for objectors. If any body got objections they may appear on **25.04.2023 at 10.30 A.M** either in person or through an Advocate before the court and file objections if any. If they fail to do so the matter will be decided in accordance with law.

SCHEDULE : Chittoor District-Chittoor Sub District- Chittoor Municipal Corporation - 64 Iruvaram Village Accounts.
1.S.No.232/2-wet - 0.64 acrs
2.S.No.231-wet- 0.48 acres
3.S.No.237/2-wet -0.25 acres
East: Tank bund, West : Land in S.No.237/1, North: Road, South: Land in S.No.231 and 232/2
Undivided half shalre in the above said properties.

Sd/- **M.SUBRAMANYAM REDDY**
Advocate for Petitioners
Chittoor, Dt.10-04-2023